క్లుప్తంగా

ఏపీఓ మహేష్ బదిలీ

గరిడేపల్లి : జాతీయ ఉపాధి హామీ పథకం గరిడేపల్లి మండల ఏపీఓగా పనిచేస్తున్న మహేష్ శనివారం మోతె మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డీఆర్‌డీఏలో పనిచేస్తున్న సురేష్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. సురేష్ బాధ్యతలు స్వీకరించారు.

హుజూర్‌నగర్‌లో ఉరుములు, మెరుపులతో వర్షం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పలువురు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులకు పలువురు భయాందోళనకు గురయ్యారు.

హనుమాన్ జయంతి కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్, సర్పంచ్, ఎంపీటీసీ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 12 తేదీ నుంచి 14వ తేదీ వరకు శ్రీహనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సాతులూరి వెంకటేశ్వరరావు, ఈఓ వెంకటచలపతిరావు తెలిపారు. శనివారం గోపాలపురంలో హనుమాన్ జయంతి కరపత్రాన్ని సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, ఎంపీటీసీ చీకూరి రాజారావుతో కలిసి వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ధర్మకర్తలు నారాయణ, రాఘవయ్య, గోపాలకృష్ణ, వెంకటేశ్వరావు, సైదయ్య, శ్రీను, సుందరయ్య, నాగసైదులు, ఏడుకొండలు, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

కోదాడరూరల్ : ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలను ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారే తప్ప రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 20 రోజులు అవుతున్నా కాంటాలు కాక, లారీలు లేక మిల్లులకు ధాన్యం తరలించడంలో ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. ఈలోపు వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించిన తర్వాత అక్కడ తరుగు పేరుతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ముత్యాలమ్మ, బొడ్రాయి విగ్రహాలకు పాలాభిషేకం



బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహాలకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు

చిలుకూరు : కొత్త చిలుకూరులో కొనసాగుతున్న బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం ఉదయం ముత్యాలమ్మ ఆలయం ఆవరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బొడ్రాయి ఏర్పాటు చేసే ప్రదేశం వద్ద బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి, పోతరాజు విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మసీదులో సమస్యలు పరిష్కరించాలని వినతి



వక్ఫ్‌బోర్డు జిల్లా అధికారికి వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఉస్మానియా మసీదులో పేరుకుపోయిన సమస్యలను వక్ఫ్ బోర్డు అధికారులు వెంటనే పరిష్కరించాలని మైనార్టీ నాయకులు అజీజ్ పాషా, మన్సూర్ అలీ కోరారు. శనివారం పట్టణానికి వచ్చిన వక్ఫ్ బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ మహమూద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5వ నెంబర్ దుకాణం అమ్మకాలు, కొనుగోలుపై జరుగుతున్న ప్రచారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలన్నారు. పేరు మార్పిడి నిలుపుదల చేసి వక్ఫ్‌బోర్డు నిబంధనల ప్రకారం అర్హులైన ముస్లింలకు దుకాణాన్ని కేటాయించాలని వారు కోరారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ అమ్మకం, కొనుగోలు జరిగితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సాధతిక్, మజీద్, అక్బర్, జానీ బాష, ఇబ్రహీం, రసూల్, హిజ్రీ, సలావుద్దీన్, బాబా, సైదా తదితరులు పాల్గొన్నారు.

పేరుకే ‘డబుల్’.. సౌకర్యాలు నిల్

- డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద కల్పించని మౌలిక వసతులు
- ఇళ్ల మధ్య పారుతున్న మురుగు
- తాగునీటికి కటకట
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మౌలిక వసతులు కల్పించని కాగితరామచంద్రాపురం డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీ

నడిగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోట్ల రూపాయలతో ఇళ్లు నిర్మించారు కానీ మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం ప్రభుత్వ యంత్రాంగం విఫలమైంది. దీంతో మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం, సిరిపురం, కరివిరాల గ్రామాలలో నిర్మించిన డబుల్ బెడ్ రూం కాలనీలలో అంతర్గత రహదారులు, డ్రెయినేజీ, విద్యుత్, తాగు నీటి సౌకర్యం లేకపోవడంతో ఆ కాలనీలకు చెందిన ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ జీవనం..

మండల పరిధిలోని సిరిపురం, కాగితరామచంద్రాపురం గ్రామాలలో 40 చొప్పున మొత్తం 80 ఇళ్లు నిర్మించారు. కానీ మౌలిక వసతులైన అంతర్గత రహదారులు, తాగు నీటివసతి, విద్యుత్ సౌకర్యం, డ్రెయినేజీలు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. ఎలాంటి వసతులు కల్పించకుండానే ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్ల పట్టాలను కూడా పంపిణీ చేసింది. కాగితరామచంద్రాపురంలో అనేక మంది లబ్ధిదారులు ఇళ్లల్లోకి వెళ్లారు. ఎలాంటి వసతులు లేకున్నా సొంత ఖర్చుతో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు. మురుగు కాల్వల సౌకర్యం లేకపోవడంతో ఇళ్ల మధ్యనే మురుగు నిల్వ ఉంటోంది. అలాగే రాత్రి సమయంలో విష పురుగులు సంచరిస్తున్నాయని కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. సిరిపురం కాలనీలో మాత్రం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. కానీ మౌలిక వసతులు లేకపోవంతో ఎవరూ కూడా ఇళ్లల్లోకి వెళ్లలేదు.

తాగు నీటి ఇబ్బందులు..

కరివిరాలలో రెండేళ్ల కిందట నిర్మించిన 50 డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ ఇళ్లల్లోకి నల్లాల సౌకర్యం కల్పించలేదు. విద్యుత్ సౌకర్యం కూడా అస్తవ్యస్తంగా ఉంది. కావున సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి డబుల్ బెడ్ రూం కాలనీలను సందర్శించి ఆ కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. కానీ ఇళ్ల వద్ద ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు. అంతర్గత రహదారులు, విద్యుత్, డ్రెయినేజీల సౌకర్యం ఏర్పాటు చేయలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– చావల సరిత, కాగితరామచంద్రాపురం

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మా గ్రామంలో 50 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కానీ తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ ద్వారా నిత్యం తాగు నీరు రావడంలేదు. అలాగే గ్రామ పంచాయతీ ద్వారా ప్రత్యేక పైపు లైన్ ఏర్పాటు చేసి, తాగు నీటి సమస్యను పరిష్కరించాలి. పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించాలి.

– కేసగాని భద్రయ్య, కరివిరాల

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడఅర్బన్ : జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం కోదాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎలక్ట్రానిక్ మీడియా కోదాడ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి కోదాడ ఎమ్మెల్యేతో పాటు ఐజేయూ జాతీయ ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. రాష్ట్రంలో 20 వేల మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించామన్నారు. సీఎం కేసీఆర్ ప్రెస్ అకాడమికి రూ. 42 కోట్లు నిధులు ఇచ్చాడని తెలిపారు. జర్నలిజం ఫోరం జిల్లా అధ్యక్షుడు వజ్జె వీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కారింగుల అంజన్‌గౌడ్, ఐజేయూ నాయకులు బంకా వెంకటరత్నం, వంగవీటి శ్రీనివాసరావు, కుడుముల సైదులు, తోటపల్లి నాగరాజు, చెరుకుపల్లి శ్రీకాంత్, తంగేళ్లపల్లి లక్ష్మణ్, నజీర్, సురేష్, చంద్రశేఖర్, గోపాలకృష్ణ, శ్రీహరి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



హుజూర్‌నగర్ : ఆర్థికసాయం అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్



గరిడేపల్లి : మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న గుండు వెంకట్‌గౌడ్

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన తుమ్మల పారిజాతం ఇటీవల మృతి చెందారు. శనివారం మృతురాలి కుటుంబానికి జీఎస్‌సీ విక్టరీ ఫౌండేషన్ (గుండు నారాయణ– చుక్కమ్మ) చైర్మన్ గుండు వెంకట్‌గౌడ్ రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఇన్‌చార్జ్ నందిగామ రామారావు, గుండు సీతారాములు, పోలంపల్లి నరసింహారావు, మల్లయ్యస్వామి, జడ గోపి, కురాకుల కృష్ణమూర్తి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, యేజేకెల్, మూర్తి నాయుడు, యశ్వంత్‌గౌడ్, రాజుగౌడ్, సైదయ్య, నర్సయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ. 10 వేలు అందజేత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన అల్లం కిరణ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో శనివారం మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కడియాల రామకృష్ణ, కె.కొండల్‌రెడ్డి, సాయి, నాగశేఖర్, రాజు, బి.నాగేశ్వర్‌రావు, కె.మధుబాబు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

అందె కోటయ్యకు పలువురి నివాళి



అందె కోటయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు అందె కోటయ్య ఇటీవల మృతి చెందారు. శనివారం గ్రామంలో నిర్వహించిన అందె కోటయ్య దశదిన కర్మకు బీజేపీ రాష్ట్ర నాయకుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి, హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ దాసరి మల్లేశం పాల్గొని.. కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేకల వెంకటేశ్వర్లు, నాయకులు గంధం సతీష్, రామినేని కృష్ణయ్య, చిత్తలూరి సోమయ్య, చంద్రారెడ్డి, యల్లయ్య, కుందూరు వీరకోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, సుందరి రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఏసీపీ..

అందే కోటయ్య దశదిన కర్మకు శనివారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) చందా సుధాకర్‌రెడ్డి హాజరై కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింగ్ అంజయ్య, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు యడవల్లి బాటసారి, వెంకటేశ్వర్లు, వీరస్వామి తదితరులున్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించేందుకు కృషి



మాట్లాడుతున్న అదనపు జడ్జి భవ్య

కోదాడఅర్బన్ : కోదాడ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని బదిలీపై కోదాడ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులైన కె.భవ్య తెలిపారు. కోదాడ అడిషనల్ జూనియర్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కోదాడ కోర్టు హాల్‌లో శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ కోదాడ అడిషనల్ జడ్జిగా తన పరిధిలోని కేసులను త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవబత్తిన నాగార్జునరావు, ప్రధాన కార్యదర్శి సాధు శరత్‌బాబు, ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాస్‌నాయుడు, కోశాధికారి జానిపాషా, అర్వపల్లి పవన్, దొడ్డ శ్రీధర్, నాగరాజు, చలం, హేమలత, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రవిని అభినందిస్తున్న శీలం శ్రీను

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : సిమెంట్ పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంలో కాంట్రాక్టర్‌లు విఫలం చెందుతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, సిమెంట్ క్లస్టర్ కార్మికుల సంఘం కన్వీనర్ వట్టెపు సైదులు ఆరోపించారు. చింతలపాలెం మండలం దొండపాడులో సీఐటీయూ ఆధ్వర్యంలో సిమెంట్ పరిశ్రమ క్లస్టర్ కార్మికుల సంఘం సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిమెంట్ పరిశ్రమలో కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సిమెంట్ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంలో యాజమాన్యాలు వైఫల్యం చెందుతున్నాయన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జూలకంటి రంగారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వట్టెపు సైదులు, గౌరవ సలహాదారులుగా ఎ.సీతారాంరెడ్డి, కమల్, బాబు, వెంకయ్య, అధ్యక్షుడిగా యరపాటి రవి, ఉపాధ్యక్షుడిగా శౌరి, ప్రధాన కార్యదర్శిగా నేరెడ్ల శ్రీను, సహాయ కార్యదర్శిగా ఉప్పల భాగ్యరాజు, కోశాధికారిగా గురవయ్య, వెంకయ్య, కమిటీ సభ్యులుగా గిరి, యాకోబ్, రవి, వీరయ్య, నరసింహారావు, శ్రీనివాసచారి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ముందంజ



సభ్యత్వం అందజేస్తున్న మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి

హుజూర్‌నగర్ : మహిళల సమస్యలు పరిష్కరించడంలో జాతీయ మహిళా సమాఖ్య ముందుంటుందని ఆ సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో జాతీయ మహిళా సమాఖ్య సభ్యత్వ నమోదును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. మహిళలకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించాలని కోరారు. మహిళలకు అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి పాలకూరి మమత, నాయకురాళ్లు జాన్సీ, తిరుపతమ్మ, శైలజ, మీనా, ధనమ్మ, ఫాతిమా, లక్ష్మి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న సర్పంచ్, తదితరులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని గణపవరంలో గల వరవర రంగనాయక స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాల కరపత్రాలను శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో ఆదివారం నుంచి 9వ తేదీ వరకు పలు పూజా కైంకర్యాలతో పాటు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆదివారం రాత్రి భజన, కోలాటం, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం, సోమవారం ట్రాక్టర్ రివర్స్ పోటీలు, 9న రౌడీరాణా పోలీస్ పృథ్వీ సాంఘిక నాటకం ప్రదర్శించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్టా శ్రీవిజయకిరణ్, జాబిశెట్టి శ్రీనివాసరావు, పొట్టా మహేశ్వరావు, పోశం శ్రీనివారావు, శంకర్ తదితరులు ఉన్నారు.

9వ రోజు కొనసాగిన జేపీఎస్‌ల సమ్మె



మేళ్లచెరువు : పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు



కోదాడరూరల్ : జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలుపుతున్న వరప్రసాద్‌రెడ్డి, నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన శాంతియుత నిరవధిక దీక్ష శనివారం 9వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు మండలంలోని వీఆర్ఏలు తమ సంఘీభావం తెలిపి సమ్మెలో కూర్చున్నారు. ఈ సందర్భంగా జేపీఎస్‌లు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ తమను రెగ్యులరైజ్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందని వాపోయారు. నిరంతరం గ్రామాల అభివృద్ధికి శ్రమిస్తున్న తమపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెలో కార్యదర్శులు ఐతగాని నాగమణి, బొమ్మగాని నరేష్, బాల్దూరి ఇందిరా, శేఖర్, సునిత, వీఆర్ఏలు తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌లు, ఎంపీటీసీల మద్దతు

మేళ్లచెరువు : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్‌లపై ప్రభుత్వం స్పందించి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అనంతరం రూ.45 వేల ఆర్థికసాయాన్ని పంచాయతీ కార్యదర్శులకు అందించారు.



చిలుకూరులో జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు



హుజూర్‌నగర్‌రూరల్ : జూనియర్ కార్యదర్శుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న వీఆర్‌ఏలు

కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

కోదాడరూరల్ : నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గత తొమ్మిది రోజులుగా జేపీఎస్‌లు చేస్తున్న నిరవధిక సమ్మెకు శనివారం కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతు తెలిపి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యదర్శులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, సుమన్‌రెడ్డి, సులోచనరావు, నర్సింహారావు, మదార్‌సాహెబ్, కార్యదర్శులు వెంకటనారాయణ, వీరబాబు, కావ్య, నాగలక్ష్మి, కవిత తదితరులు ఉన్నారు.

చిలుకూరు : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బంధం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. చిలుకూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ కార్యదర్శులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు ఆయన శనివారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు గుండు ఆదినారాయణ, యలగొండ శ్రీను, కొండా ధనమూర్తి, కార్యదర్శుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అశోక్ వర్మ, సారిక, గ్రామ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రామారావు, శోభన్‌బాబు, కార్తిక్, కవిత, నవీన్, ఆవినాష్‌రెడ్డి, అంజయ్య, ప్రవళిక, సౌమ్య, ఆకాంక్ష, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి.. గుంతలుగా మారి



నడిగూడెంలో ప్రధాన రహదారిపై గుంత

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. చినుకు పడితే రోడ్డు చిత్తడిగా మారుతోంది. బస్టాండ్ సెంటర్ వెంట ఉన్న గాంధీ పార్క్ ఎదుట, గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. రహదారి పూర్తిగా దెబ్బతినడంతో పాటు లోతైన గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారి మీదుగా నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. లోతైన గుంతలు ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేసి, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పుట్టిన ఊరి కోసం కల్యాణ మండపం



శ్రీపార్వతిరామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న వెంకటేశ్వరావు- భాగ్యలక్ష్మి దంపతులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని శివాలయంలో గరిడేపల్లి గ్రామ మొదటి సర్పంచ్ తడకమళ్ల జానకిరామారావు- అనసూయల జ్ఞాపకార్థం వారి కుమారుడు తడకమళ్ల వెంకటేశ్వర్‌రావు- భాగ్యలక్ష్మి దంపతులు నిర్మించిన శ్రీపార్వతి పరమేశ్వర కల్యాణ మండపాన్ని శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను వారి ఇంటి వద్ద నుంచి కోలాటాలతో ఊరేగింపుగా శివాలయం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం వేద పండితులు శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి శాంతి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తదనంతరం దాతలను ప్రజాప్రతినిధులు, గ్రామప్రజలు సత్కరించారు. ఈ సందర్భంగా దాత వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ పుట్టిన ఊరికి ఏదో ఒకటి చేయాలనే ఆకాంక్షతో గ్రామ ప్రజలందరికి ఉపయోగపడే కల్యాణ మండపాన్ని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కార్డన్‌సెర్చ్

సూర్యాపేట క్రైం: శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ సోమనారాయణ సింగ్ తెలిపారు. పట్టణ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్ పరిధిలోని బాషానాయక్ తండాలో శనివారం తెల్లవారు జామున కార్డన్ సెర్చ్ నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. గ్రామంలో సరైన కాగితాలు లేని 24 ద్విచక్ర వాహనాలు, బొలేరో ట్రక్కు, ట్రాక్టర్ సీజ్ చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సాయిరాం, యాదవేందర్‌రెడ్డి, మధు, సైదులు, సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



సీతారాములును పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు వెంకన్న

హుజూర్‌నగర్ : ప్రమాదవశాత్తు కిందపడి తలకు బలమైన గాయాలతో ఏరియా హాస్పిటల్లో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నాయకుడు కస్తాల సీతారాములును డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ శనివారం పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నాయకులు కస్తాల శ్రవణ్‌కుమార్, మంజుల, తన్నీరు మల్లికార్జున్, యరగాని నాగన్న, అరుణ్‌కుమార్, డీవీ, రాజానాయక్, కె.వెంకటేశ్, కె.మహేష్, జె.మల్లయ్య, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

గాంధీ పార్క్ ఆధునీకరణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చైర్ పర్సన్ శిరీష

కోదాడ : గాంధీ పార్క్ ఆధునీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష కోరారు. పట్టణంలోని గాంధీ పార్క్‌లో జరుగుతున్న పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీ పార్క్‌ను ఆధునీకరించి పిల్లలకు, మహిళకు ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆమె తెలిపారు. పిల్లలు ఆడుకోవడానికి అన్ని రకాల ఆట వస్తువులను ఏర్పాటు చేయడంతో పాటు ఆహ్లాదకరంగా ఉండేందుకు పచ్చికను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట నాయకులు వనపర్తి లక్ష్మీనారాయణ, తిపిరిశెట్టి రాజు, కౌన్సిలర్ పెండెం వెంకటేశ్వర్లు, డీఈఈ పిచ్చయ్య, ఏఈ శేఖర్ తదితరులు ఉన్నారు.